సాక్షి
కుమురం భీం

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



హృదయం.. జర పదిలం

హృదయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. యుక్త వయస్సులోనే గుండెపోటుతో మృత్యువాత పడుతున్నారు. 8లో▸



'కంది'న రైతు ఆశలు!

ఈ ఏడాది అకాల వర్షాలు, పొగమంచుతో కంది దిగుబడి గణనీయంగా తగ్గింది. జిల్లాలో 36,745 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.4 /16.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

డీఎఫ్‌వోగా నీరజ్‌కుమార్



నీరజ్‌కుమార్, డీఎఫ్‌వో, ఆసిఫాబాద్

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా ఫారెస్ట్ అధికారి(డీఎఫ్‌వో)గా నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న దినేశ్‌కుమార్ కేరళ రాష్ట్రానికి డెప్యూటేషన్‌పై వెళ్లడంతో 40 రోజులుగా డీఎఫ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. తెలంగాణ క్యాడర్ 2019 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్ అధికారి అయిన నీరజ్‌కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎల్లందు ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడి బదిలీపై రానున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఈయన బాంబే ఐఐటీలో ఇంజనీరింగ్ చదివారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల నుంచి రాష్ట్రస్థాయి అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక సాధికారత, వివిధ రంగాల్లో విశేషంగా కృషి చేస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను dwoasifabad@gmail.com,tgsrc@gmail.comలకు మెయిల్ ద్వారా, వెంగళరావునగర్ అమీర్‌పేట్, హైదరాబాద్ లేదా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, బాలసదన్, జన్కాపూర్, ఆసిఫాబాద్‌కు పోస్టు ద్వారా గడువులోగా అందేలా పంపించాలని పేర్కొన్నారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఈ నెల 15 నుంచి మార్చి 2 వరకు జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల లాగిన్‌లో హాల్‌టికెట్లను బ్యాచ్ వారీగా డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్థులకు తేదీల వారీగా వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా జనరల్ 20 కేంద్రాలు, ఒకేషనల్ 11 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 13న చీఫ్ సూపరిటెండెంట్లు, నిర్వాహకులకు శిక్షణ నిర్వహించి సామగ్రి అందజేస్తామన్నారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

సీఎంను కలిసిన మంత్రి, ఎమ్మెల్యేలు



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యేలు

కైలాస్‌నగర్: గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు విద్యుత్, సాగునీరు, రైతుబంధుతో పాటు భూమిలేని గిరిజనులకు గిరిజన బంధు అమలు చేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడంపై ఉమ్మడి జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, రేఖానాయక్, దుర్గం చిన్నయ్య, జి.విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

'పోడు పట్టాలపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: పోడు భూములకు పట్టాలు ఇస్తానని గతంలో ప్రకటించి ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ మాటమార్చే ప్రయత్నం చేస్తున్నారని, పోడు భూముల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు పట్టాలిస్తామని పూర్తి సమాచారం సేకరించారని, అయినా సమస్యను కొలిక్కి తీసుకురాలేదని ఆరోపించారు. తాజాగా ఆదివాసీలు అడవుల్లోకి వెళ్లమని లిఖితపూర్వకంగా రాసి ఇస్తేనే పట్టాలు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. అఖిల పక్ష తీర్మానం అనే కొత్తరాగం తీసుకురావడం సరికాదన్నారు. వెంటనే పట్టాలు ఇవ్వని పక్షంలో ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

వైద్యారోగ్య శాఖకు ఖాళీల రోగం



- భర్తీకి నోచుకోని 29 వైద్యాధికారుల పోస్టులు
- వేధిస్తున్న కింది స్థాయి సిబ్బంది కొరత
- సకాలంలో వైద్య సేవలందక పేదలకు ఇబ్బందులు
- గత్యంతరం లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న వైనం

సాక్షి, ఆసిఫాబాద్: వైద్యో నారాయణ హరి.. అంటే వైద్యుడు నారాయణుడితో సమానమని అర్థం. ప్రభుత్వ వైద్యశాలల్లో నాడిపట్టే వైద్యులు లేక ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన జిల్లా అయిన కుమురం భీం ఆసిఫాబాద్‌లో సకాలంలో వైద్యసేవలు అందక రోగులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తూ జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో 24 పీహెచ్‌సీలు, సామాజిక ఆసుపత్రులు, 108 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటినీ వైద్యసేవల కొరత పీడిస్తోంది. వైద్యశాలల్లో పూర్తిస్థాయి సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గత్యంతరం లేక మంచిర్యాల, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంతోపాటు ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీ అనే తేడా లేకుండా రోగాలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నా ఖాళీల భర్తీకి యంత్రాంగం చొరవ చూపడం లేదు.

ఆసిఫాబాద్ వైద్యశాలలోనూ అంతే..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కీలకమైన సామాజిక వైద్యశాలలోనూ 13 డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు ఉండగా అన్నీ ఖాళీగానే ఉన్నాయి. 23 మంది సివిల్ అసిస్టెంట్లు సర్జన్లు పనిచేయాలి. కానీ 16 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 17 పోస్టులు భర్తీ కాలేదు. అదేవిధంగా స్పెషలిస్ట్ సివిల్ సర్జన్ పోస్టులు 9, జనరల్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఏడు ఖాళీగానే ఉన్నాయి.

ఖాళీలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో 110 వైద్యాధికారుల పోస్టులు ఉండాల్సి ఉండగా.. 76 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన అన్ని కేటగిరీల సిబ్బంది పోస్టులు 306 ఖాళీలు ఉండడం గమనార్హం.

సమస్యంతా గిరిజన ప్రాంతాల్లోనే..

జిల్లాలో గిరిజన గూడేలు అత్యధికంగా ఉన్నాయి. ఏజెన్సీలో వైద్యసేవల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఏజెన్సీలోని 15 పీహెచ్‌సీల పరిధిలో 35 వైద్యుల పోస్టులకుగాను తొమ్మిది మంది డాక్టర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన 26 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. తిర్యాణి సీహెచ్‌సీలో డిప్యూటీ సివిల్ సర్జన్‌తోపాటు నాలుగు సివిల్ అసిస్టెంట్ సర్జన్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉండగా.. స్టాఫ్‌నర్సులే వైద్య సేవలు అందిస్తున్నారు. వాంకిడి పీహెచ్‌సీలో నలుగురు మెడికల్ ఆఫీసర్లతోపాటు డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు భర్తీ కాలేదు. ఇక్కడా హెడ్ నర్సు, స్టాఫ్‌నర్సులు రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. సిర్పూర్(యూ) పీహెచ్‌సీలోనూ ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు పనిచేయాల్సి ఉండగా.. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టాఫ్‌నర్సు పోస్టు సైతం ఖాళీగానే ఉంది. కేవలం ఐదుగురు మహిళా ఎంపీహెచ్‌ఏలతో నెట్టుకొస్తున్నారు. ఇలా కెరమెరి, లింగాపూర్, జైనూర్, బెజ్జూర్, భట్టుపల్లి పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు లేక రోగులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. కీలకమైన ఈ ప్రాంతాల్లో శాశ్వత పద్ధతిన పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్కారు దృష్టికి ఖాళీల సమస్య

జిల్లాలో వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టుల ఖాళీలు భర్తీ చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరాం. త్వరలో భర్తీ చేసే అవకాశం ఉంది.

– డాక్టర్ టి.ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో

జిల్లా కలెక్టర్‌గా
హేమంత్ బోర్కడే

- నేడు ఉదయం 10.30 గంటలకు బాధ్యతల స్వీకరణ
- ట్రెయినీ కలెక్టర్‌గా ఇక్కడి నుంచే ప్రస్థానం ప్రారంభం
- నిర్మల్ జిల్లా నుంచి మళ్లీ కుమురంభీంకు రాక



హేమంత్ బోర్కడే, కలెక్టర్

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కొత్త కలెక్టర్‌గా హేమంత్ బోర్కడే రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్‌గా హేమంత్ శనివారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్)గా పనిచేస్తున్న హేమంత్ బోర్కడే తొలుత ట్రెయినీ కలెక్టర్‌గా కుమురం భీం జిల్లా నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి తిరిగి ఇదే జిల్లాకు కలెక్టర్‌గా రావడం విశేషం. 2019 జూన్ నుంచి 2020 ఆగస్టు 7 వరకు ఇక్కడ శిక్షణ పొందారు. అనంతరం ఆయన నిర్మల్ జిల్లాకు అడిషనల్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. అక్కడ 30 నెలలకు పైగా పనిచేశారు. విధుల్లో ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరుంది. 2018లో ఐఏఎస్‌కు ఎంపికైన బోర్కడే సొంత జిల్లా మహారాష్ట్ర విదర్భ రీజియన్‌లోని అమరావతి. ఆ నగరంలోనే ఆయన ఇంటర్ వరకు చదివారు. అనంతరం పూణేలో 2007లో బీటెక్, ముంబైలో ఎంబీఏ(2010) పూర్తి చేశారు. తర్వాత 2014 నుంచి 2018 వరకు సీఐఎస్‌ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించారు. అయితే ఇటీవల కలెక్టర్ల బదిలీల్లో వనపర్తి జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాను కుమురంభీం జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. మళ్లీ అదేరోజు ఆమెను జగిత్యాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి నుంచి మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం జిల్లాకు కొత్త కలెక్టర్‌ను నియమించడంతో సంతోష్ ఎఫ్‌ఏసీ బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు.

విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో 50 పాఠశాలల ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు తొలిమెట్టు కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో 50 పాఠశాలలను ఎంపిక చేసి విద్యా సామర్థ్యాలు పెంచేందుకు పిరమిడ్ ఫౌండేషన్ వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఆయా పాఠశాలలకు సంస్థ రూ.500ల విలువైన టీఎల్‌ఎం కిట్లు అందజేస్తుందని తెలిపారు. టీఎల్‌ఎంలను ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారిసత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైరిగూడ మార్గాన్ని బాగు చేయాలి



జీఎంతో చర్చిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ వెళ్లే రోడ్డు మార్గాన్ని వెంటనే బాగు చేయించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్‌తో సమావేశమై కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కైరిగూడ ఓసీపీకి వెళ్లే మార్గంలోని పావురాల గుట్ట వద్ద వర్షాకాలం రోడ్డు కుంగడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. యాజమాన్యం యుద్ధ ప్రతిపాదికన పావురాల గుట్ట వద్ద రోడ్డును బాగు చేయాలని కోరారు. అలాగే గోలేటి నుంచి జాతీయ రహదారి వరకు నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, కార్పొరేట్ చర్చల ప్రతినిధి మంగీలాల్, మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సమ్మయ్య, ఫిట్ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

'ప్రజా గోస– బీజేపీ భరోసా' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. రెబ్బెన మండలం రోళ్లపాడులో శుక్రవారం శక్తి కేంద్రాల మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ఎదురవుతున్న సమస్యలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 20 వరకు అన్ని శక్తి కేంద్రాల్లో ప్రజా గోస– బీజేపీ భరోసా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, పార్లమెంట్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్, ప్రభారి రావుల రాజేందర్, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

- ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 1వరకు స్నాక్స్
- 34 పని దినాలకు నిధులు మంజూరు
- ఒక్కో విద్యార్థికి రూ.15 చెల్లింపు



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి.. విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సాగుతోంది. ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు, సాయంత్రం 4.45గంటల నుంచి 5.45గంటల వరకు సబ్జెక్టు వారీగా బోధిస్తున్నారు. బోధించిన పాఠ్యాంశాలపై ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయాన్నే బడికి వచ్చే విద్యార్థులు అర్ధాకలితో సాయంత్రం వరకూ ప్రత్యేక తరగతుల్లో కూర్చోవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం మినహా ఇంటి నుంచి వచ్చి తిరిగి వెళ్లే వరకూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 23వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 1వరకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం పూట 34 పని దినాలు స్నాక్స్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున నిర్ణయిస్తూ అవసరమైన బడ్జెట్ కేటాయించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా ఆరోగ్యకరమైన స్నాక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులు ఒకట్రెండు రోజుల్లో ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఖాతాల్లో జమ కానున్నాయి. దీంతో విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది.

నిధులు ఇలా..

మంచిర్యాల జిల్లాలో 111 పాఠశాలల్లో 4,252మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15చొప్పున రోజుకు రూ.63,780, ఈ లెక్కనే ఆదిలాబాద్‌కు రూ.72,990, కుమురంభీంకు రూ.42,690, నిర్మల్ జిల్లాకు రూ.58,710 మంజూరుకు నిర్ణయించారు. ఇలా 34 రోజులకు గాను అవసరమైన బడ్జెట్‌ను కేటాయించారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కేటాయిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. స్నాక్స్ అందించేందుకు ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో నిధుల కేటాయింపు ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	34రోజులకు నిధులు
ఆదిలాబాద్	112	4,866	రూ.24,81,660
కుమురంభీం	58	2,846	రూ.14,51,460
మంచిర్యాల	111	4,252	రూ.21,68,520
నిర్మల్	117	3,914	రూ.19,96,140

సంఘాల ఏర్పాటుకు నైపుణ్య పరీక్షలు



నైపుణ్య పరీక్షకు హాజరైన గిరిజనులు

కెరమెరి/నార్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లోని చెరువుల రక్షణతోపాటు సహకార సంఘాల ఏర్పాటుకు అర్హులైన గిరిజనులకు నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు తెలిపారు. మత్స్య అభివృద్ధి శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో జైనూర్ మండలం దేవుగూడ గ్రామంలో కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ) మండలాలకు చెందిన గిరిజనులకు శుక్రవారం మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో చెరువులపై పూర్తి అధికారం ఆదివాసీలకే దక్కనుందన్నారు. సభ్యుల ఎంపిక కోసం చెరువుల వద్దే నైపుణ్య పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. దేవుగూడ, జెండాగూడ, దుబ్బగూడ, గౌరి లెండిగూడ, కెస్లాగూడ, పార్డ, కల్లెగాం, పోచంలొద్ది, శెట్టి హడ్బూర్ చెరువులకు సంబంధించి 159 మంది ఆదివాసీలతో గిరిజన మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ శిబిరం ప్రత్యేకాధికారి డి.సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ్‌కుమార్, సర్పంచులు కోవ నాందేవ్, కుమురం న్యానేశ్వర్, పెసా చట్టం మొబలైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యోగా కేంద్రాలు

- జిల్లాలో తొమ్మిది శిక్షణ సెంటర్ల ఏర్పాటు
- రూ.54లక్షల నిధులు మంజూరు
- ఇప్పటికే 70శాతం పనులు పూర్తి



కెరమెరిలో నూతనంగా ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కేంద్రం

ఆసిఫాబాద్‌అర్బన్: మారిన ఆహారపు అలవాట్లతో ప్రతిఒక్కరిని ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం వ్యాయమంతోపాటు యోగాపై దృష్టి సారించారు. ముఖ్యంగా కరోనా తర్వాత యో గాకు ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పల్లెల ముంగిట్లోకి యోగా శిక్షణ కేంద్రాలు తేనుంది. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లాలో తొమ్మిది శిక్షణ కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.6లక్షల చొప్పున మొత్తం రూ.54లక్షల నిధులు మంజూరయ్యాయి. జిల్లాలోని బీబ్రా, బెజ్జూర్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), గురుడుపేట (కౌటాల), వాంకిడి, కెరమె రి, చిర్రకుంట, పహాడిబండ గ్రామాల్లో ఈ యోగా కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమం ద్వారా యోగా విశిష్టత, సాధన అంశాలపై గ్రామీణులకు అవగాహన కల్పించనున్నారు.

అనారోగ్యం దరిచేరకుండా శిక్షణ

పల్లె ప్రజలను అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ముందస్తుగా యోగా ఆసనాలపై శిక్షణ అందజేస్తారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను ఎలా అదుపులో ఉంచుకోవాలనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. సీజనల్ వ్యాధులను ఎలా ఎదుర్కోవాలి..? వాటి నివా రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసికంగా ప్రశాంతంగా ఉండటం ఎలా..? తదితర విషయాలను శిక్షకుడు వివరిస్తారు. అలాగే నేషనల్ ఆయుష్ నిబంధనల ప్రకారం యోగా కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టారు. యోగా కేంద్రంలోకి గాలి, వెలుతురు వచ్చేలా 18 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవుతో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా సెంటర్‌కు ఒక యోగా శిక్షకుడిని నియమించనున్నారు.

తుది దశకు పనులు

యోగా కేంద్రాల ఏర్పాటులో మొదట పల్లెలకు ప్రాధాన్యమిచ్చారు. అందులో భాగంగా జిల్లాలో బీబ్రా(దహెగాం), బెజ్జూర్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), గురుడుపేట (కౌటాల), వాంకిడి, కెరమెరి, చిర్రకుంట, పహాడిబండ గ్రామాల్లో ఈ సెంటర్లను నిర్మిస్తున్నారు. ఆయా చోట్ల ఈ పనులు 70శాతం వరకు పూర్తి చేశారు. కొన్ని గ్రామాల్లో స్థల సేకరణలో ఇబ్బందుల కారణంగా పనులు ప్రారంభించలేదని తెలుస్తోంది. త్వరలోనే అక్కడ కూడా పనులు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆయుష్ కార్యక్రమం ద్వారా యోగా శిక్షణ కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. అలాగే దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటాయి. జిల్లాలో ఇప్పటికే యోగా సెంటర్ల పనులు 70 శాతం మేర పూర్తయ్యాయి. త్వరలోనే శిక్షకుల నియామకం చేపట్టి, కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– వాణి, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్, ఆసిఫాబాద్

క్లుప్తంగా

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్ రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఖాళీగా ఉన్న ఐదు సీట్ల భర్తీ కోసం 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో హాల్‌టికెట్ నంబర్ 270850 నుంచి 271377 వరకు, సెయింట్ క్లారిటీ పాఠశాలలో హాల్ టికెట్ నంబర్ 271378 నుంచి 271843 వరకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 11 గంటలకు కేంద్రంలోపలికి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు.

పకడ్బందీగా వేలాల జాతర ఏర్పాట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని జైపూర్ మండలంలో ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించే వేలాల జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మంచిర్యాల ఆర్డీవో వేణు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వేలాల జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఏర్పాట్లను తహసీల్దార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించాలని, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి తీరంలో తాగునీరు, మూత్రశాలలు, తాత్కాలిక స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని అన్నారు.

26వ వార్డులో హాథ్ సే హాథ్ జోడో అభియాన్



ప్రజలకు వివరిస్తున్న సురేఖ


మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధి 26వ వార్డులోని గౌతమీనగర్‌లో కాంగ్రెస్ హాథ్ సే హాథ జోడో అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ విజయాలు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు. నాయకులు గట్టు స్వామి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ ధ్వంసం చేసిన 15మందిపై కేసు

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామ సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్ట్‌ను ధ్వంసం చేసిన వారిపై నాన్‌బెయిలెబుల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కొసన రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8న రాత్రి చెక్‌పోస్ట్ వద్ద జరిగిన ప్రమాదానికి అటవీ అధికారులే కారణమంటూ గ్రామానికి చెందిన 15 మంది యువకులు అటవీశాఖ కార్యాలయం, కంప్యూటర్, సీసీ కెమెరా, సోలార్ సిస్టం తదితర రూ.3లక్షల విలువైన సామగ్రి ధ్వంసం చేశారని అటవీశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హృదయం.. జర పదిలం





కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన నాగపురె కనికినాథ్ 25 ఏళ్ల యువకుడు. ఇటీవల ఎడమ చేయి నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. స్థానిక వైద్యులతో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. ఇతడి గుండెలో రక్త నాళాలు మూసుకుపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స అందిస్తుండగానే కనికినాథ్ మృతి చెందాడు. దీంతో అతడి భార్య కళావతి, తల్లి కుసుమబాయి ఇంటి పెద్ద దిక్కును కోల్పోయారు. గుండె అనారోగ్యం కారణంగా ఒక కుటుంబం అనాథగా మారింది.

- చిన్నవయసులోనే గుండెపోటు
- మారుతున్న అలవాట్లే కారణం
- మార్చుకోవాలంటున్న వైద్యులు

చింతలమానెపల్లి(సిర్పూర్): హృదయం మానవ శరీర నిర్మాణంలో అత్యంత కీలకం. శరీరంలోని కీలక అవయవాల్లో ఒకటి. గుండె పనితీరు మనిషి పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. హృదయ స్పందన ఆధారంగానే మనిషి ఆరోగ్యాన్ని గుర్తిస్తారు. అలాంటి గుండె అనారోగ్యం పాలు కాకుండా పదిలంగా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

కలవర పెడుతున్న గుండెపోటు

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 2లక్షలకు పైగా 30 ఏళ్లకు పైబడిన వారున్నారు. వీరిలో సుమారు 20వేల మందికి పైగా దీర్ఘకాలిక హృదయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారుల అంచనా. ఈసంఖ్య ఏటా పెరుగుతోందని పేర్కొంటున్నారు. హృదయ సంబంధిత రోగాలపై అవగాహన లేకపోవడంతో గుండె జబ్బుల కారణంగా మరణాల సంఖ్య కూడా పెరుగుతోందని వైద్య శాఖ పేర్కొంటోంది.

మారుతున్న జీవన విధానాలతోనే..

ఆధునీకరణ, పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అనేక మార్పులకు కారణమవుతోంది. గతంలో నగరాలు, పట్టణ ప్రాంతాలకు పరిమితమైన ఈజీవన విధానం నేడు మారుమూల గ్రామాలకు విస్తరించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆహారపు అలవాట్లు, దినచర్య మార్పులు అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. రాత్రి వేళ నిద్ర పోకుండా ఉండడం, సమయపాలన, పరిమితి లేని భోజన అలవాట్లు గుండె పనితీరుపై తీవ్ర ప్రభావానికి కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ సమయం మొబైల్ ఫోన్‌ను వినియోగిస్తున్న కారణంగా మనిషి మానసిక స్థితి మారుతోంది. ఒత్తిడి పెరిగి గుండె జబ్బులకు కారణమవుతోంది. వారసత్వంగానూ గుండె జబ్బులు సంక్రమిస్తాయి. అధిక రక్తపోటు, మధుమేహం అదుపులో లేకపోతే గుండె జబ్బుల బారినపడే అవకాశాలున్నాయి.

ప్రథమ చికిత్సే ప్రధానం

గుండెపోటు వచ్చేవారికి వెంటనే వైద్యం అందించాల్సి ఉంటుంది. పట్టణాలు, నగరాల్లో గుండె చికిత్స అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో సకాలంలో వైద్యం అందే అవకాశం ఉంది. వైద్యం అందుబాటులో లేని ప్రాంతాల్లో తాత్కాలికంగా ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణనష్టం జరగకుండా నివారించవచ్చు. ఛాతిలో నొప్పి, చెమటలు పట్టడం, కళ్లు తిరగడం, చేతులు లాగడం, సాధారణం కన్నా ఎక్కువగా గుండె కొట్టుకోవడం, గుండె పట్టేసినట్లు తదితర లక్షణాలతో గుండె నొప్పిని గుర్తించవచ్చు. గుండె నొప్పి వచ్చిన సమయంలో రోగిని గాలి ఆడేలా ఉంచి ఆక్సిజన్ అందించేందుకు ప్రయత్నించాలి. రోగికి సీపీఆర్ నిర్వహించి శ్వాస ఆడేలా చేయాలి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

గుండె పనితీరు సమీక్షించుకోవాలి

ప్రతి ఒక్కరూ గుండెకు సంబంధించిన వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. గుండె పని తీరును ప్రతి ఒక్కరూ సమీక్షించుకోవాలి. అందుబాటులో ఉన్న పరీక్షల ద్వారా హృదయం పనితీరును పరిశీలించవచ్చు. వయస్సు ఆధారంగా, అనారోగ్య సమస్యల ఆధారంగా గుండెను వైద్యుల పర్యవేక్షణలో పరిశీలించుకోవడం తప్పనిసరి.

– రవికుమార్, ఎండీ జనరల్ మెడిసిన్

వైద్యుల సలహాలు పాటించాలి



కోవిడ్ వచ్చిన వారిపై హృదయ సంబంధిత వ్యాధులు ప్రభావితం చేసే అవకాశం ఉంది. కోవిడ్ వచ్చి తగ్గిన వారిపై పోస్ట్ కోవిడ్ కారణంగా శ్వాస సంబంధిత వ్యాధులు, గతంలో వాడిన మందుల కారణంగా గుండె పనితీరులో మార్పులు ఉండే అవకాశం ఉంది. వైద్యుల సలహాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు.

– సందీప్‌కుమార్, ఎండీ పల్మనాలజీ, రిమ్స్

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



వీవీ రామారావు (ఫైల్)

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వీవీ రామారావు (44) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భార్య సిర్పూర్(టి) మండలం లోనవెల్లి జెడ్పీ హైస్కూల్‌లో మాథ్స్ టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు మార్తెలున్నారు. రామారావు మృతిపై తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

పరీక్షలు చేసుకోవాలి

గుండెపోటుకు గురికాకుండా వైద్యుల సూచనలు పాటిస్తే గుండె జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. గుండె పనితీరు తెలుసుకోవడానికి అనేక పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. గుండెలో రక్త నాళాల్లో కొవ్వు పేరుకుపోవడంతో గుండెకు ఆక్సిజన్ సరఫరా నిలిచి గుండెపోటు వస్తుంది. దీనిని గుర్తించడానికి ప్రాథమికంగా ఈసీజీ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. గుండె పనితీరు పరీక్షించడానికి 2డీ ఇకో, ఆంజియోగ్రామ్ లాంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వయస్సు, ఆరోగ్య స్థితిని అనుసరించి తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత గుండెకు శస్త్ర చికిత్స నిర్వహించడం సులువుగా మారింది. పేరు పొందిన ఆసుపత్రుల్లో యాంజియోప్లాస్టీ ద్వారా రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వును 30 నిమిషాల్లో తొలగిస్తున్నారు. గుండెపోటు వచ్చిన వారికి తిరిగి కొవ్వు పేరుకుపోకుండా స్టంట్ వేస్తున్నారు. ప్రభుత్వం అందించే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కూడా ఈ చికిత్స చేయించుకోవచ్చు. గుండె సంబంధిత సమస్యలున్నవారు హృద్రోగ వ్యాధి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుని వారి సలహాలు పాటిస్తే గుండెను పదిలంగా ఉంచుకోవచ్చు. శరీరంలో కొవ్వు పెరగకుండా నియమిత పద్ధతిలో ఆహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా నడక, వ్యాయామం, యోగా చేస్తూ ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

పెన్షన్ రాకపోవడానికి కారకులపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాలటౌన్: సింగరేణి విశ్రాంత కార్మికులకు పెన్షన్ రాకపోవడానికి కారకులపై వెంటనే చర్య తీసుకోవాలని సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో తెలంగాణ సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం సమావేశం గూడ రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా పలువురు సంఘం నాయకులు మాట్లాడారు. జనవరి 2023కు సంబంధించిన కోల్ మైన్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్ పెన్షన్) దాదాపు 12వేల పైచిలుకు సింగరేణి విశ్రాంత కార్మికుల బ్యాంక్ ఖాతాల్లో జమ కాకపోవడానికి సీఎం పీఎఫ్ అధికారులా? లేక మీసేవ కేంద్రం నిర్వాహకులా? అనే కోణంలో దృష్టి కేంద్రీకరించి కారకులపై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమగ్ర న్యాయ విచారణ జరిపించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనవరి, ఫిబ్రవరి 2023కు సంబంధించిన రెండు నెలల ఏరియర్స్ మార్చిలో చెల్లించాలని సీఎం పీఎఫ్ అధికారులను డిమాండ్ చేసినట్లు తెలిపారు. రూ.2వేలు, రూ.3వేల పెన్షన్ పొందుతున్న విశ్రాంత కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెన్షన్‌రాని 12వేల మంది విశ్రాంత కార్మికులు మరోసారి జీవన ప్రమాణం లైవ్ సర్టిఫికెట్ తప్పకుండా తీసుకోవాలని గత నవంబర్‌లో ఏయే మీ సేవ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్లోడ్ చేసుకున్నారో.. మళ్లీ అవే కేంద్రాల్లో ఉచితంగానే సేవలు అందించాలని నిర్వాహకులను కోరినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు తుమ్మల శ్రీనివాసరెడ్డి, ఆడిచర్ల రాజేశం, డీఎస్పీ బోసు, ఇట్టం రాజయ్య, మామిడాల సత్యనారాయణ, కడమాండ పోచయ్య, బూర్ల దామోదర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ మాటలు సరికాదు'

దండేపల్లి: పోడుభూముల గురించి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు గిరిజనులను అవమానపరిచేలా ఉన్నాయని ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు కోట్నాక తిరుపతి పేర్కొన్నారు. దండేపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం 'అడవులన్నీ నరికి ఆదివాసీలకు పంచుదాం' అనడం గిరిజనులను హేళన చేసినట్టుగా ఉందన్నారు. పోడు భూముల విషయాన్ని పక్కన పెట్టి కొత్తగా గిరిజన బంధు అనే మరో కొత్తమోసానికి తెర లేపుతున్నారని ఆరోపించారు. పోడు భూముల విషయంలో గిరిజనులను ఉద్దేశించి సీఎం మాట్లాడిన తీరు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

ప్రీవెడ్డింగ్ షూట్ స్థలాన్వేషణ ప్రాణం తీసింది..!

- మరో 11రోజుల్లో పెళ్లి
- తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- యువకుడు దుర్మరణం



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఎస్సై రామకృష్ణ

జైపూర్: ప్రీవెడ్డింగ్ షూట్ ఇప్పుడు సర్వసాధారణంగా మారింది. కానీ.. షూట్ కోసం స్థలాన్వేషణ కాబోయే పెళ్లికొడుకు ప్రాణం తీసింది. మరో పదకొండు రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా రోడ్డు ప్రమాదం రూపంలో సింగరేణి కార్మికుడు రమేశ్(32)ను మృత్యువు కబళించింది. పెళ్లి డప్పు మోగాల్సిన ఆ ఇంట చావు డప్పు మోగింది. ఎస్సై రామకృష్ణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని పోచమ్మ బస్తీకి చెందిన మోరే ప్రమీల, రాజయ్య దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు వివాహమైంది. కుమారుడు రమేశ్ తన తండ్రి రాజయ్య సింగరేణి ఉద్యోగంలో కారుణ్య నియామకం ద్వారా చేరాడు. ఆర్కే 7గనిలో పని చేస్తున్నాడు. గోదావరిఖనికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. ఈ నెల 22న పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రీవెడ్డింగ్ షూట్ కోసం గోదావరిఖని చుట్టుపక్కల ప్రాంతాలను చూడడం కోసం రమేశ్ మోటార్ సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జైపూర్ మండలం మంచిర్యాల–చెన్నూర్ 63వ నంబరు జాతీయ రహదారిపై ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా మోటార్‌సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన మరో లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రమేశ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబంలో తీరని విషాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్సై రామకృష్ణ పరిశీలించారు.



రమేశ్ (ఫైల్)

కోల్‌బెల్ట్ ఏరియాలో మౌలిక వసతులు



పంపును ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: శ్రీరాంపూర్ నస్పూర్ ఏరియా ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని సీతారాంపల్లి గోదావరి ఇంటెక్‌వెల్‌లో 190 హెచ్‌పీ వర్టికల్ టర్బైన్ పంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీవాసులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో సివిల్ డీజీఎం శివరావు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సీఎంపీఎఫ్ చిట్టీలను అందించాలని సెక్యూరిటీ గార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. శుక్రవారం ఏరియా జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు 2019 నుంచి సీఎంపీఎఫ్‌ల పేరిట వేతనాల్లో నుంచి డబ్బులు కోత పెడుతున్నారని తెలిపారు. అయితే ఐదేళ్లుగా కార్మికుల సీఎంపీఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్మికుల వేతనాల్లో నుంచి కోత విధిస్తున్న డబ్బులకు సంబంధించిన సీఎంపీఎఫ్ చిట్టీలను అందజేస్తే కార్మికుల్లో ఉన్న ఆందోళనలు తొలిగిపోతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన జీఎం మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీ వేశామని తెలిపారు. కమిటీ సమావేశంలో సీఎంపీఎఫ్ విషయాన్ని కూడా చర్చించి తొందరలో చిట్టీలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జాక్సన్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, శేఖర్, మహేందర్, సెక్యూరిటీ గార్డులు శంకర్, సాగర్‌గౌడ్, మల్లేశ్, విజయ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కుల బహిష్కరణతో వేధింపులు



మాట్లాడుతున్న కవిత, సంపత్ దంపతులు

బెల్లంపల్లి: భూవివాదాన్ని సాకుగా చూపి తమను అన్యాయంగా కుల బహిష్కరణ చేసి మానసికంగా వేధిస్తున్నారని కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన దుర్గం కవిత–సంపత్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో గోడు వెల్లబోసుకున్నారు. కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ కింద కోల్పోయిన భూమి డబ్బుల గురించి గ్రామంలో కొందరితో తగవు ఉందని తెలిపారు. డబ్బుల వ్యవహారం మాట్లాడదామని పిలిచి తమ కులానికి చెందిన కొందరు ఉద్దేశపూర్వకంగా ఇష్టం వచ్చినట్లు తిట్టారని, దాడి చేయడానికి యత్నించారని ఆరోపించారు. దీంతో వారిపై కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. వారిని పోలీసులు పిలిపించి మందలించగా మరోసారి ఇలా చేయమని, ఆ తర్వాత తమను కుల బహిష్కరణ చేశారని వివరించారు. ప్రస్తుతం తమతో గ్రామస్తులు మాట్లాడడానికి ముఖం చాటేస్తున్నారని, కనీసం బైక్‌పై కూడా లిఫ్ట్ ఇవ్వడానికి భయపడుతున్నారని తెలిపారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



రాజేందర్ (ఫైల్)

తాంసి: మద్యానికి బానిసై ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన మామిడి రాజేందర్ (40) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో గ్రామ సమీపంలోని పంటచేనులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో గణపతి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కాగా, రాజేందర్ కుమారుడు సాయికుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు.

ఉపాధి కూలీ మృతి



బాలయ్య మృతదేహం

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నైజం బాలయ్య (57) శుక్రవారం ఉపాధి పనులకు వెళ్లి ఛాతిలో నొప్పిగా ఉందని అక్కడే కిందపడిపోయాడు. తోటి కూలీలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కూలీల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎదులాపురం: ద్విచక్ర వాహనం చోరీ ఘటన టూటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ షహబాజ్ అలీ ఈనెల 5న రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆర్టీసీ పార్కింగ్ స్థలంలో ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి ఇప్పోడకు వెళ్లాడు. 6న తిరిగి వచ్చి చూస్తే వాహనం లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల సొంతింటి కలను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికల కాలపరిమితి ముగిసినా యాజమాన్యం ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. టీబీజీకేఎస్ కార్మికుల హక్కులు కాపాడడంలో విఫలమైందని ఆరోపించారు. ఆర్థిక దోపిడీ పెరిగిందని కార్మికులు ఏఐటీయూసీని ఆదరించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు సుదర్శన్, ప్రభాకర్, మనోహర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నిర్వాహకులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మహాసమ్మేళనం సమన్వయకర్తలు కే వాణిశ్రీ, సీ రాజారెడ్డి కోరారు. మహా సమ్మేళనం కోర్ టీం సభ్యులతో కలిసి శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. 1985 నుంచి 2021 వరకు పదో తరగతి పూర్తి చేసిన సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు, 200 మంది ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 12న పాఠశాల మైదానంలో 'మహా సమ్మేళనం–మహా ప్రయోజనకరం' అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవిదేశాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ఉపయోగపడేలా చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దానిని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించడమే ట్రస్ట్ ముఖ్యఉద్దేశమని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు గడ్డం నర్సయ్య, డప్పు సమ్మయ్య, మల్లేశ్, శ్రీధర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రాజమౌళి

మందమర్రిరూరల్: రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులకు సకాలంలో పింఛన్ అందించి ఆదుకోవాలని ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి రాజమౌళి డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని ఐఎన్టీయూసీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం, సీఎంపీఎఫ్ ఆఫీస్ సిబ్బంది అవగాహన లోపంతో విశ్రాంత ఉద్యోగులకు రెండు నెలలుగా పింఛన్ పంపిణీ చేయడం లేదని మండిపడ్డారు. వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీపీఆర్ఎంఎస్ ద్వారా యాజమాన్యానికి రూ.40 వేలు చెల్లించిన విశ్రాంత ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో యాజమాన్యం పేమెంట్ చేయకపోవడంతోనే చికిత్స అందించడం లేదని ఆరోపించారు. వెంటనే బకాయిలున్న ఆసుపత్రులకు పేమెంట్ చెల్లించాలన్నారు. కొంతమంది సీపీఆర్ఎంఎస్ కోసం వారికి అందుబాటులో లేక రూ.40 వేలు చెల్లించలేదని, కటాఫ్ డేట్ ఉందని వారి నుంచి పేమెంట్ తీసుకోవడం లేదని, ఇప్పుడు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వారికి సీపీఆర్ఎంఎస్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, రాంబాబు, తిరుపతి, రామయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.